# ....ఇస్ మిట్టీసే తిలక్ కరో!

ఫిలిప్స్ పవర్ హౌస్ నుండి ఘంటసాల మృదుమధుర గానం వీనులవిందు చేస్తుంటే సోఫాలో కూర్చుని లయబద్ధంగా చేతులు కదిలిస్తూ, తలాడిస్తూ పరిసరాలు మరచి ఆనందిస్తున్నారు డాక్టర్ తాతారావు.

శ్రీమతి రాజేశ్వరి వచ్చే అతిథుల కోసం కమ్మని వంటకాలు చేయడంలో తలమున్కలవుతున్నది. వారి పిల్లలు నాగార్జున, ఝాన్సీ వీడియో గేమ్ ఆడటంలో నిమగ్నమై ఉన్నారు.

తాతారావు నెల రోజులపాటు స్వదేశంలో బంధు మిత్రులతో ఆనందంగా గడిపి రెండు రోజుల క్రితమే బ్రూక్లిన్‌కు తిరిగొచ్చారు. తనకు అభిమాన గాయకుడైన ఘంటసాల గీతాలన్నీ సేకరించి తెచ్చుకున్నారు.

"ఆ మొగల్ రణధీరులు...." స్వాతంత్ర్య సమరగీతం ఆలాపన వింటుంటే ఆయన శరీరం రోమాంచితమైంది. గీతం యొక్క భావాన్ని సైతం గొంతులో పలికించగల విశిష్టమైన గాయకుడిగా ఘంటసాల అంటే ఆయనకు అభిమానం.

క్యాసెట్ అయిపోయింది. టైం చూసుకున్నారు.

సరిగ్గా పన్నెండు గంటలు. మరో అరగంటలో అంతా వచ్చేస్తారని అనుకుంటూ భార్యకు ఏదైనా సహాయం కావాల్సి వస్తుందేమోనన్నట్లుగా వంట గదిలోకి వెళ్లారు. అక్కడ అలాంటి అవసరం ఏమీ లేదని చెప్పగానే డ్రాయింగ్ రూమ్‌లోకి తిరిగొచ్చేశారు.

బ్రూక్లిన్ హాస్పిటల్లో అటెండెంట్ కార్డియాలజిస్ట్‌గా చాలాకాలంగా పని చేస్తున్నారు తాతారావు. సంపాదనకు లోటులేదు. ఇతరత్రా వ్యాపారాల్లో కూడా భాగస్వామ్యం ఉంది. వృత్తిపరంగా చూపే శ్రద్ధ, నైపుణ్యం మంచి పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి.

భారతదేశం వెళ్తూ కార్డియాలజీ యూనిట్ బాధ్యతలు డాక్టర్ మాధవరావుకు అప్పగించి వెళ్లారు. తిరిగొచ్చాక ఛార్జి తీసుకోవటానికి, పేషెంట్ల బాగోగుల్ని అవగతం చేసుకోవడం, క్లెయిమ్‌లు వెరిఫై చేయడం మొదలైన వ్యవహారాలన్నీ చక్కబెట్టుకోవటంలో రెండు రోజులు ఊపిరి సలపలేదు.

వీకెండ్ రోజు భోజనానికి రమ్మని మిత్రుల్ని సకుటుంబ సమేతంగా ఆహ్వానించారు. ఇండియాలో వారి బంధు మిత్రులు అందించిన కానుకలు, సందేశాలూ భద్రంగా తీసుకొచ్చినట్లు తెలిపారు.

ఆహ్వానితులలో బ్రాంక్స్‌లో కార్నెల్ యూనివర్సిటీలో ఇంజనీర్‌గా పని చేస్తున్న రామకృష్ణ, క్వీన్స్‌లో సెయింట్ జోన్స్ యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి, స్టేటన్ ఐలెండ్‌లో ఇండియన్ గ్రోసరీ స్టోర్స్ ప్రొప్రయిటర్ భరద్వాజ, మాన్‌హటన్‌లోని న్యూయార్క్ యూనివర్సిటీలో రీసెర్చి చేస్తున్న రమణ ఉన్నారు.

సుమారు దశాబ్దం క్రితం తండ్రి చనిపోయినప్పుడు కుటుంబ సమేతంగా ఇండియా వెళ్లొచ్చారు తాతారావు. ఆ తర్వాత వెళ్లాల్సిన అవసరం కలగలేదు ఇంతకాలం.

తోడబుట్టిన అన్నకూతురి పెళ్లికి ఆహ్వానం స్వదేశం వైపు గాలి మళ్లేలా చేసింది. పెళ్లిళ్లప్పుడైతే అయిన వాళ్లందర్నీ ఒకేచోట శ్రమ లేకుండా కలుసుకోవచ్చు. సకుటుంబంగా వెళ్లాలనిపించినా పిల్లల చదువులు కుంటు బడతాయన్న ఉద్దేశంతో తనొక్కడే బయల్దేరారు.

ఇండియా వెళ్లేటప్పుడు దక్షిణామూర్తి, రామకృష్ణ, భరద్వాజలు జాన్.ఎఫ్.కెన్నెడీ విమానాశ్రయానికి వచ్చి వీడ్కోలిచ్చారు. తమ వారిని కలిసి పరామర్శించమన్న అభ్యర్థనతోపాటు కొన్ని కానుకలు కూడా ఇచ్చి అందజేయు మన్నారు. రమణ మాత్రం రాలేదు. ఇండియా బయల్దేరుతున్న వారం అతను కలవనే లేదు. తమా రెండుసార్లు ప్రయత్నించాడు. యూనివర్సిటీలో లేడు.

ఇండియాలో ఉన్న నెల రోజులు ఎందరో మిత్రుల్ని, బంధువుల్ని కలిశారు. వాళ్లు తన పట్ల చూపిన ఆత్మీయతకు, ఆదరణకు ముగ్ధులయ్యారు. మిత్రు లిచ్చిన కానుకలను భద్రంగా ఇవ్వాల్సిన వాళ్లకు అందజేశారు. వారి ఆనందానికి అంతులేదు. వాటి విలువకన్నా తమ కోసం గుర్తుంచుకొని పంపారన్న సంతృప్తి ఎంతో గొప్పది.

రమణ స్వగ్రామం వెళ్లక పోవడం వెలితి అనిపించింది. అతడు తన వాళ్లను పరామర్శించి రమ్మని అభ్యర్థించక పోయినా వెళ్లాలనే నిర్ణయించుకున్నారు. అతని స్వగ్రామం గుంటూరుకు పదమూడు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి మీద ఉన్నది. ఒక గంట వ్యవధి చాలు వెళ్లి రావడానికి.

రెండ్రోజుల్లో అమెరికా తిరుగు ప్రయాణం అనగా వీలు చిక్కింది. ఒక సాయంత్రం నాలుగ్గంటలకల్లా బయల్దేరి వెళ్లారు ఇద్దరు మిత్రుల్ని వెంటేసుకుని.

ఆ ఊరు చిన్న పల్లెటూరు.

రమణ తండ్రి పేరు దశరథరామయ్య. ఆయన గురించి వాకబు చెయ్యడం చాలా మందికి వింతగానూ, ఆసక్తిగానూ కనిపించినట్లుంది.

"బ్యాంకీ వాళ్లా బాబూ!" అనడిగారు ఇద్దరు ముగ్గురు. తనతో వచ్చిన మిత్రుల్ని అడిగారు తాతారావు వాళ్ల ప్రశ్నలోని ఔచిత్యం అర్థంకాక.

"ఏముంది! ఎక్కువ మెట్ట ప్రాంతం. కొంతకాలంగా పంటలు సరిగా పండటం లేదు. పల్లెల్లో ప్రతివాడూ ఏదో రకంగా అప్పులతో రోజుల్ని నెట్టుకొస్తున్న వాళ్లే. కారొస్తుందంటే అందరికీ గుండెదడ. పన్నుల కోసం రెవిన్యూ వాళ్లో, బాకీల వసూళ్ల కోసం బ్యాంకుల

వాళ్లో తప్ప కార్లలో ఈ పల్లెలకు వచ్చే వాళ్లెవరుంటారు?" వివరించాడు మిత్రుడు.

దశరథరామయ్య ఇంటిముందు కారాగింది. ఆయన స్థితిగతుల్ని ఆ పూరిల్లు అడక్కనే చెబుతున్నది. కారాపి దిగుతుండగానే ఓ వృద్ధుడు బిక్కు బిక్కుమంటూ కారు దగ్గరకు వచ్చాడు.

అతని వంటిమీద చొక్కా లేదు. పంచ మోకాళ్లపైకి కట్టుకున్నాడు. శుష్కించిన దేహం వయస్సును పెంచి చూపిస్తున్నట్లనిపించింది. ఆయన వస్తూనే సవినయంగా నమస్కరించాడు.

"అయ్యా! తమరి దగ్గర మాట నిలుపుకోలేక పోతున్నాను. ఏ యేటి పంట ఆ ఏడు పెట్టుబళ్లకే చాలటం లేదు. తిండిగింజలు అప్పు చేసుకు బతకాల్సొస్తంది. ఎంత కిందా మీదా పడ్డా వెసులుబాటు కావడం లేదు" చెప్పుకుపోతున్నా డాయన.

తాతారావు వెంట ఉన్న మిత్రుడు ఆయన ధోరణికి అడ్డు తగిలాడు. విషయం అర్థం చేసుకుని, "మేం బ్యాంకు వాళ్లం కాదండీ! దశరథరామయ్యంటే మీరే కదూ?" అడిగాడు.

"మరేనండి!" చెప్పారాయన. ఆయన ముఖంలో భయం తొలగి ఆశ్చర్యం చోటు చేసుకున్నది.

"నమస్కారమండీ! నా పేరు తాతారావు. అమెరికాలో ఉంటున్నాడే మీ అబ్బాయి రమణా, నేను స్నేహితులం. నేను అమెరికా నుండొచ్చాను. మిమ్మల్నొకసారి పరామర్శించి పోదామని వచ్చాను" డాక్టర్ తాతారావు వివరించారు.

ఆ వృద్ధుడి ముఖం దేదీప్యమానంగా వెలిగిపోయింది.

"అట్టానా! నా మతి మండిపోను. బ్యాంక్ వాళ్లనుకున్నావయ్యా! రండి! లోనికి రండి, బాబూ!" సాదరంగా ఆహ్వానించి వసారాలో మంచం వాల్చాడు.

"ఏమేవ్! అమెరికాలో అబ్బాయి స్నేహితులట, వచ్చారు..... అమ్మాయ్ త్వరగా ఓ దుప్పటి మంచం మీద వెయ్యి" హడావుడిగా కేకలు వేశాడు.

ఒక యువతి లోపల్నుండి దుప్పటి తెచ్చి మంచం మీద వేసి సర్దింది. ఆవిడ కొంగు పట్టుకుని తిరుగుతున్న మూడేళ్ల పిల్లవాడు అతిథుల్ని ఆశ్చర్యంగా పరిశీలనగా చూస్తున్నాడు.

"అమ్మాయి రమణ భార్య. వీడు కొడుకు. అబ్బాయి అమెరికా వెళ్లేటప్పటికి కడుపుతో ఉందమ్మాయి. ఇంతవరకు తండ్రీ కొడుకులు ఒకరి ముఖం ఒకరు ఎరుగరు" పెద్దాయనే చెప్పాడు తాతారావు అడుగుదా మనుకున్నంతలో.

చిరునవ్వుతో చేతులు జోడించింది ఆ యువతి.

"రవీ! ఈ తాతాగారు నాన్నగారి దగ్గర నుండి వచ్చారట. నాన్నేం చేస్తుంటారని నన్ను వేపుకు తింటుంటావుగా, వారి నడుగు చెప్తారు" పిల్లవాడితో అంది రమణ భార్య.

తండ్రి గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి ఆ పిల్లవాడి ముఖంలో ఎంత కనబడిందో, భర్త సమాచారం గురించిన ఆత్రుత ఆవిడ ముఖంలోనూ అంతే కనబడింది.

"తాతగారూ! మా నాన్నగారు ఏం చేత్తన్నారు! మా ఊరెప్పుడొస్తారు" అడిగాడు పిల్లవాడు.

"మీ నాన్నగారు సైంటిస్టు బాబూ! మనకు వంట్లో బాగుండలేదనుకో, ఏం చేస్తాం? మందు లేసుకుంటాం గదా! పెద్ద జబ్బులకు కొత్త కొత్త మందులు కనిపెడుతున్నారు. పని అయిన తర్వాత తప్పక వస్తారు"

"ఒకసారి వచ్చి పోవచ్చు గదా!"

"మీ నాన్నకు రావడం కుదరడం లేదనే నన్ను చూసి రమ్మన్నారు. నీ కోసం మంచి కారొకటి ఇచ్చి పంపారు, చూడు" అంటూ బ్యాగ్‌లో నుండి రిమోట్ కంట్రోలు కారొకటి తీసి ఆపరేట్ చేయసాగారు.

ఈ కారును వింతగా పిల్లవాడెలా చూస్తున్నాడో, పెద్దవాళ్లూ అలానే చూస్తున్నారు.

రివ్వున ముందుకు పరిగెత్తడం....టక్కున ఆగటం... రివర్స్‌లో వేగంగా వెనక్కు రావడం, అటు ఇటూ పరిగెత్తడం... పిల్లవాడు ఒకటే కేరింతలు. తాతారావు దానిని పిల్లవాడి చేతికిచ్చి ఆపరేట్ చేయడం చూపారు.

అంతలో రమణ తల్లి గ్లాసులో చిక్కటి పాలు కాచి తెచ్చింది. అప్పటికప్పుడే ఆవిడ పాలు పితుక్కు రావడం గమనిస్తూనే ఉన్నారు తాతారావు.

"బాబూ! కాఫీలవి పెట్టడం మా కట్టె అలవాటు లేదు. ఆరోగ్యానికి మంచిది కాదని రమణ తాగనిచ్చేవాడు కాదు. పాలు మంచివే కదా! తీసుకోండి" ఆత్మీయంగా అందించింది ఆవిడ.

"ఎందుకమ్మా మీ కీ శ్రమ"? మర్యాదపూర్వకంగా అన్నారు.

"శ్రమ ఏముంది, నాయనా! అంత దూరం నుండి పని గట్టుకుని పలకరించి పోడానికి వచ్చారు. ఈ మాత్రం చెయ్యకపోతే మనసూరుకుంటుందా?" ఆవిడ గొంతులో అభిమానం తొంగిచూసింది.

దశరథరామయ్య తన కొడుకు యోగక్షేమాలు వింపాదిగా విచారించి సమాచారం రాబడుతున్నాడు. కొడుకు అక్కడ ఎలాంటి ఇబ్బందులు పడకుండా సుఖ సంతోషాలతో వుంటున్నాడా అనేది తెలుసుకోవాలన్నదే ఆయన తాపత్రయం.

స్త్రీ సహజమైన సిగ్గుతో రమణ భార్య భర్త గురించి ఎలాంటి ప్రశ్నలు అడగలేకపోయినా, మామగారు రాబడుతున్న సమాధానాలను శ్రద్ధగా ఆలకిస్తున్నది.

పోలరాయిడ్ కెమెరాలో అందరివీ ఫొటోలు తీశారు తాతారావు. రమణ చూసేందుకని ప్రత్యేకంగా కొడుకు ఆడుకుంటున్నప్పుడు తీశారు. అప్పటికప్పుడు ఆ ఫొటో ప్రింట్లు వాళ్లకు చూపినప్పుడు సంభ్రమాశ్చర్యాలతో నోటమాట పెగల్లేదు.

గంటకు పైనే గడిపారక్కడ. సూర్యుడు కొండవీటి కొండల్లోకి ఒదుగుతున్నాడు. చిరుమువ్వల సవ్వడులతో, ధూళి రేపుకుంటూ ఆలమందలు ఊళ్లోకి తిరిగొస్తున్నాయి. వీధిలో ఆగి ఉన్న కారుని, కనిపిస్తున్న మనుష్యుల్ని అంతా వింతగా చూస్తూ వెళ్తున్న వాళ్లే.

"ఏం బాబూ! నాన్నగారికి ఏం చెప్పమంటావ్?" బయల్దేరుతూ అడిగారు తాతారావు.

"రమ్మనండి. లేకుంటే నాకు బోల్డు కోపం వస్తుంది" ముద్దుగా మాటలు కూడబలుక్కుంటూ చెప్పాడు.

అంతా ఒక్కసారి నవ్వేరు.

"నానెప్పుడొస్తారు, ఎందుకు రారు, మనవంటే కోపమా? అంటూ ఎప్పుడూ నన్ను వేధించుకు తింటుంటాడండీ! అల్లరి కొడుకును పట్టుకోవడం కష్టంగా ఉందని చెప్పండి" కొడుకును చంక నేసుకొని సాగివస్తూ చెప్పింది రమణ భార్య.

"బాబుగారూ! అభిమానాలు బతుకులకు ఆధరవు లవుతాయా! నా కొడుకు పదిమందికి ప్రయోజనం కలిగే పని చేశాడని నలుగురూ చెప్పుకుంటుంటే వినాలన్న కోరిక ఒక్కటే మిగిలింది. మేం సుఖంగానే ఉండామిక్కడ. ఆరోగ్గెం జాగర్తగా చూసుకోమనండి" తండ్రి చెప్పాడు, కంట తడి కన్ను జారకుండా.

తాము ఇక్కడ పడుతున్న కష్టాలు కొడుకు చెవికి చేరకూడదన్న ఆయన ఉద్దేశం అవగతమవుతూనే ఉంది తాతారావుకు.

"మొగుడూ పెళ్లాలు చిలకా గోరింకల్లా ఒక గూటిలో ఉంటేనే ముచ్చటగా ఉంటది బాబూ! అమ్మాయిని, పిల్లాడిని తీసుకెళ్లగలిగే రోజు ఎప్పుడొస్తదో!" అన్నది రమణ తల్లి.

"నేను ఎల్లుండి సాయంత్రం గుంటూరు నుండి బయల్దేరుతున్నాను. మీ రేమైనా అబ్బాయికి పంపాలనుకుంటే తెచ్చి ఇవ్వండి. తీసుకెళ్తాను" చిరునామా కూడా రాసిచ్చారు దశరథరామయ్యకు.

కారు కదులుతుండగా అంతా చేతులు జోడించారు. అందరి ముఖాల్లోను ఏదో సందేశం పంపాలన్న మూగవేదన. అది మాటల కందని అశక్తత. కనబడినంత మేర పిల్లవాడు చేతు లూపుతూనే ఉన్నాడు.

హైదరాబాద్ ప్రయాణానికి కారులో సామాన్లవి సర్దుతుండగా చెమటలు గక్కుకుంటూ దశరథరామయ్య వచ్చాడు. తాతారావు బయల్దేరాలనుకున్న సమయానికే సరిగ్గా బ... ఉంటే అందకపోను. ఆయన వస్తాడన్న నమ్మకం ఏదో మనస్సును అదుపుచేసి తాతారావును కదల నివ్వలేదు.

"ఇల్లు తెలుసుకోవడం కాస్త ఇబ్బంది అయిందండీ! ఉన్న ఫళాన అబ్బాయికి ఏం పంపాలో తోచింది కాదు. ఇది పట్టుకెళ్లి ఇవ్వండి" అంటూ పాతకాలపు ఇత్తడి క్యారేజి అందించారు.

తాతారావు అందుకున్నారు. అన్నగారూ, ఆయన పిల్లలు ముసిముసి నవ్వులు చిందించడం గమనించక పోలేదాయన.

"మీ కేమన్నా ఇబ్బంది కలుగుతుందంటే చెప్పండి, బాబూ!" వినయంగా అన్నాడాయన.

"భలేవారే! ఇంతకన్నా బరువైన సామాన్లే పంపిస్తుంటారు. నేనేమన్నా మోపేదా, కాపేదా? ఫరవాలేదు. భద్రంగా మీ వాడికి అప్పగిస్తాను. మీరు నిశ్చింతగా వెళ్లి రండి" సాగనంపారు తాతారావు.

"బాబాయ్! మొత్తానికి ఈ ముసలాయన గొప్ప గిఫ్ట్ తీసుకొచ్చినట్లున్నాడు. అమెరికా చేర్చాలంటే తల ప్రాణం తోక కొస్తుందేమో!" అన్న కొడుకు ఎగతాళి పట్టించాడు.

"షటప్! పంపే కానుకల విలువను బట్టి ప్రేమను - అంచనా కడతావుట్రా! జీవితాన్ని మనం అనుభవిస్తున్న ఈ భోగభాగ్యాలతోనే తూచగల మనుకోవద్దు సుమా?" మందలింపుగా అన్నారు తాతారావు.

ఇతరులకు అందించే కానుకల పట్ల ఎన్నడూ ఆయనకు కలగనంత ఆసక్తి రమణ కోపం తెప్తున్న దాని పట్ల కలిగింది. ఆ పేద కుటుంబం అందులో పెట్టి పంపిస్తున్న కానుక ఏమిటన్నది ఆయన ఊహకు అందటం లేదు.

కాలింగ్ బెల్ మ్రోగింది. డాక్టర్ తాతారావు ఊహల్లోంచి వాస్తవంలోకి వచ్చారు. తలుపు కేసి నడిచారు.

వచ్చింది ప్రొఫెసర్ దక్షిణామూర్తి, ఆయన భార్య వసుమతి. దంపతుల్ని సాదరంగా ఆహ్వానించారు. రాజేశ్వరికి సహాయంగా వసుమతి కిచెన్‌లోకి వెళ్ళింది. తాతారావు, దక్షిణామూర్తి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు.

"మూర్తీ! నీ తరఫున కానుకలన్నీ భద్రంగా మీ వాళ్లకు అందజేశాను. వాళ్లూ ఏదో పేకట్ ఇచ్చారు మీ కిమ్మనమని" చెప్పారు తాతారావు.

"అలానా! ఏది?" ఆసక్తిగా అడిగాడాయన.

"అంత తొందరయితే ఎలా? అందర్నీ రానివ్వండి. ఒకేసారి ఎవరివి వారి కిచ్చేస్తాను. అలాగైతేనే థ్రిల్లింగ్‌గా ఉంటుంది" నవ్వేరు తాతారావు.

"మా మదర్ ఎలా ఉంది? అక్కయ్యా, పిల్లలూ బావున్నారా?"

"బావున్నారు. మీ అక్కగారి పిల్లలు మాత్రం భలే గడుగ్గాయిలు. ఉన్న కాసేపట్లోనే నన్ను మూడు చెరువుల నీళ్లు తాగించారు. ఇవన్నీ పంపమని చెప్పి పెద్ద లిస్టే రాసిచ్చారు" నవ్వేరు తాతారావు.

"అక్కయ్యకు లేక లేక పుట్టారు లెండి. కాస్త గారాం ఎక్కువే" సంజాయిషీగా అన్నారు ప్రొఫెసర్ దక్షిణామూర్తి.

ఆ తర్వాత ఇండియా ఆర్థిక, రాజకీయ విషయాల గురించి చర్చించుకోసాగారు. పన్నెండున్నరకల్లా అతిథులు వచ్చేశారు. రమణ మాత్రం రాలేదు.

తప్పనిసరిగా వస్తాడన్న నమ్మకం తాతారావుకు ఉంది. ఫోన్ చేసి ఆహ్వానించాడు కూడా! అతని స్వగ్రామం వెళ్లొచ్చాననీ, తన కోసం వాళ్లు పంపిన వింత కానుక ఏదో తీసుకొచ్చాననీ చెప్పారు. తన వాళ్ల యోగక్షేమాలు తెలుసుకోవాలన్న ఆరాటం అతన్నిక్కడికి లాక్కొస్తుందనే అనుకుంటున్నారు. రమణకు సొంత కారు లేదు. సబ్‌వే గుండా రావాలి. కాస్త ఆలస్యం కావచ్చు లెమ్మనుకున్నారు.

ఇంజనీర్ రామకృష్ణ ఒక ప్రతిపాదన చేశాడు. రమణ రావడం ఆలస్యమయ్యేటట్లుంది కనుక ఈలోగా మిగిలిన వారికి కానుకలు అందించాలి. భరద్వాజ కానుకల మార్పిడికి ఇష్టపడాలన్న షరతు ఒకటి విధించాడు. అంతా సరేనంటే సరేనన్నారు.

డాక్టర్ తాతారావు ముందుగా దక్షిణామూర్తికి వచ్చిన ప్యాకెట్ అందించారు.

మూర్తి నింపాదిగా ప్యాకెట్ విప్పదీస్తున్నాడు. అంతా ఆసక్తితో చూడసాగారు.

తళతళా మెరుస్తున్న వెంకటగిరి జరీ చీరలు, గద్వాల్ పట్టు చీరలు, కలంకారీ లుంగీలు, ముఖమల్ బెడ్‌షీట్లు రెండు. అద్భుతంగా ఉన్నాయన్నారందరూ.

తర్వాత రామకృష్ణ కొచ్చిన కానుక. మూడు డజన్ల పుస్తకాలు, రెండు డజన్ల పాటల క్యాసెట్లు వున్నా యందులో. రామకృష్ణ సంగీత, సాహిత్యప్రియుడు. పుస్తకాల్లో ఇటీవల

విడుదలైన కథా సంపుటాలు, కవితా సంపుటాలు ఉన్నాయి. క్యాసెట్లలో సైగల్, పంకజ్ మల్లిక్, మన్నాడే, రఫీ, లతామంగేష్కర్, కిశోర్‌కుమార్‌ల పాటలతోపాటు ప్రదీప్‌జీది కూడా ఉంది. 'గుడ్ సెలక్షన్' అని మెచ్చుకున్నారంతా.

ఇక భరద్వాజ వంతు వచ్చింది.

తాతారావు ఇండియా వెళ్తున్నప్పుడే బంగారం కొని వడ్డాణం చేయించి పట్టుకు రమ్మని ఇచ్చి పంపారు. ముందుగా ఆ నగ ఇచ్చారు తాతారావు.

"గుంటూరులో మొహమ్మద్ ఖాన్ అండ్ సన్స్ జ్యూయలర్స్ షాపులో చేయించి తెచ్చాను. లేటెస్ట్ డిజైన్ అట" ప్యాకెట్ అందించారు.

పెట్టె చెప్తున్నట్లుంది - లోపలున్న వస్తువు యొక్క నాణ్యత, నాజూకుతనం. జాగ్రత్తగా పైకి తీశాడు. అందరి కళ్లూ జిగేలుమన్నాయి.

రత్నాలు పొదిగిన పట్టీల వడ్డాణం. పనితనానికి అంతా ముగ్ధులయ్యారు. భరద్వాజ కూతురు కళ్యాణి నడుముకు పెట్టుకుని ఆనందంతో కృతజ్ఞతగా తండ్రి బుగ్గల మీద ముద్దులు కురిపించింది.

ఆ తర్వాత భరద్వాజదే గిఫ్ట్ పేకెట్ విప్పారు.

ఆవకాయ, అల్లం, టొమాటో పచ్చళ్లు, అరిసెలు, కాజాలు, కారపు చెక్కలు వగైరా తినుబండారాలు.

"మొత్తానికి భరద్వాజ టేస్ట్ ఇండియా మొత్తానికీ తెలుసన్నమాట. ఎలాగయినా తిండిపుష్టి గల మనిషి కదూ!" రామకృష్ణ మాటలకు అంతా ఒకటే నవ్వడం.

"ఎనీ ఎక్స్ఛేంజస్" ఆఫర్ చేశాడు మూర్తి.

రాజేశ్వరి ఒక రిక్వెస్ట్ చేసింది. తాతారావు ఇండియా నుండి వెంకటగిరి చీర మెరూన్ కలర్‌ది తనకున్నదే తెచ్చారు కాబట్టి, అది తీసుకుని చిలకాకుపచ్చది ఇవ్వాలని.

వసుమతి సంతోషంగా అంగీకరించింది. చప్పట్లు.

తన పుట్టిన రోజు ఫంక్షన్‌లో రత్నాల వడ్డాణం పెట్టుకోవడానికి అనుమతించాలన్న ఝాన్సీ అభ్యర్థనకు కళ్యాణి ఒప్పుకుంది.

శ్రీపాద, మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథరెడ్డిల కథాసంపుటులు, పామగంటి వారి సాక్షి సంపుటాలు చదివి ఇస్తానని తాతారావు అభ్యర్థన.

భరద్వాజ పంకజ్‌రాయ్ క్యాసెట్లడిగాడు.

నెల రోజుల్లో తిరిగివ్వాలన్న ఒప్పందం మీద ఇద్దరి అభ్యర్థనా మన్నించాడు రామకృష్ణ.

వచ్చే వీకెండ్ లంచ్ ఏర్పాట్లు భరద్వాజ ఇంట్లో చెయ్యాలనీ, ఆయా పచ్చళ్లతో కోరిన వారికి వడ్డించాలనీ షరతుతో కూడిన తీర్మానం.

భరద్వాజ దంపతుల అంగీకారంతో తీర్మానం నెగ్గింది. హర్షామోదాలతో సభ్యుల కరతాళ ధ్వనులు.

ఒంటి గంటయింది. బజర్ మ్రోగింది.

ఎదురు చూస్తున్న అతిథి రమణ రావే వచ్చాడు.

"ఐ యామ్ వెరి వెరి సారీ! నా ఆలస్యాన్ని మీరంతా మన్నించాలి" ఎంతో వినమ్రంగా అభ్యర్థించాడు.

"చిన్న శిక్షతో వదిలేస్తాం... ఐదు గుంజీళ్లు తియ్యాలి" తాతారావు డిమాండ్ చేశారు.

"ఓకే, ఓకే!" అంటూ చెవులు పట్టుకుని గబగబా ఐదు గుంజీళ్లు తీశాడు రమణ.

"మీ ఊరెళ్లి వచ్చానవడానికి సాక్ష్యంగా ముందు ఈ ఫొటోలు చూడవయ్యా!" తాతారావు అందించాడు.

రమణ రెండు నిముషాలు ఈ లోకాన్నే మరిచిపోయాడు. అయినవాళ్లు తన కళ్లెదుటే నిలబడినట్లుగా తాదాత్మ్యం చెందాడు.

"థాంక్యూ డాక్టర్! థాంక్యూ సో మచ్! నేను కోరకుండానే వెళ్లొచ్చారు, కృతజ్ఞుణ్ణి" అతని కళ్లు సజలమైనాయి.

డాక్టర్ తాతారావు రమణ భుజం తట్టారు. "నీ కోసం మీ వాళ్లిచ్చిన గిఫ్ట్ చాలా భద్రంగా తెచ్చాను మరి! "

"ఈజ్ ఇట్ సో!" పిల్లాడిలా సంబరపడ్డాడు.

పిల్లలంతా ఒకచోట చేరి కబుర్లాడుకుంటున్నారు. నాగార్జున కొత్త క్యాసెట్ ఒకటి ప్లే చేయడానికి రామకృష్ణను అడిగి తీసుకెళ్లాడు.

"ది పీజ్ ద గిఫ్ట్ ఫ్రం ఇండియా టు రమణ!" అంటూ లోపల్నుండి తెచ్చిన ఇత్తడి క్యారేజి రమణ ముందుంచాడు తాతారావు.

ముందు అందరికీ నవ్వు తెప్పించింది. తర్వాత ఆశ్చర్యంతో పాటు ఆసక్తీ తొంగి చూపింది. భరద్వాజకైతే సిల్లీగా వుంది.

"థాంక్యూ!" అందుకుని ప్రక్కన పెట్టాడు రమణ.

"మిస్టర్! మన నియమ నిబంధనల ప్రకారం మువ్వ తీసి చూపించాలి" తాతారావు డిమాండ్.

రమణ కాస్త సిగ్గుపడ్డాడు. అందులో ఏముందో? నలుగురూ హేళ్యాలాడితే తనకు బాధ కలుగుతుంది. తన వాళ్లు నేటి ప్రపంచపు ఆధునికత, నాగరికత అర్థం చేసుకోలేని అమాయకులు. తెరవడానికి సందేహిస్తున్నాడు.

"తప్పదు రమణా! దానిలో భాగం పంచుకునే హక్కు మాకు ఉంది" ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నాడు రామకృష్ణ.

రమణకు తప్పదనిపించింది. హేండిల్ లాక్ తీసి మొదటి గిన్నె మూత మెల్లగా తీశాడు.

క్షణాల్లో ఆ గదినిండా కమ్మని వాసన అలుముకుంది. పుల్లపుల్లగా తాలింపు గాటుతో మధురంగా నోరూరిస్తూ వ్యాపించింది గుంటూరు గోంగూర పచ్చడి వాసన.

భరద్వాజయితే ఎగిరి గంతేశాడు. "ఓహ్! ఈ రోజు లంచ్‌కి అద్భుతమైన స్పెషల్!" చప్పట్లు చరిచాడు.

అంతా ముక్కులు ఎగబీలుస్తూ, కళ్లింత చేసుకుని ఒకటే మైమరచిపోవడం. గుంటూరు గోంగూర పచ్చడంటే అంతగా నోరూరిస్తుంది మరి. రమణ సరే నవ్వాడు. అంతా చప్పట్లు.

మొదటి గిన్నె తీసి కింద పెట్టాడు రమణ. రెండవ గిన్నెలో పిల్లలు ఆడుకునే ఒక చిన్న బొమ్మ. అంతా ఫకాల్న నవ్వారు.

"బహుశా మీ అబ్బాయి నువ్వు ఆడుకోవాలని పంపించి ఉంటాడు. వాడి పరిజ్ఞానంలో పెద్దలైనా ఇలాంటి బొమ్మలతోనే ఆడుకోవాలి మరి" నవ్వేడు దక్షిణామూర్తి.

ఆ గిన్నెలోనే మరో వస్తువు. హృదయాకారంలో కత్తిరించబడి వున్న చిన్నరంగు అట్టముక్క.

"రమణా! ఇది నీ శ్రీమతి పంపిన ప్రేమ సందేశంలా ఉందయ్యా! నీ హృదయంలో తనొక్క దానికే చోటుంచమని వేడికోలు కాబోలు" ఫకాల్న నవ్వేడు రామకృష్ణ.

రమణ కాస్త సిగ్గుపడ్డాడు. పెళ్లయిన తర్వాత పట్టుమని రెండేళ్లయినా కలిసి కాపురం చేయనేలేదు. ఎం. ఫార్మసీ తర్వాత ఒక మందుల కంపెనీ స్పాన్సర్ చేయడంతో రిసెర్చి చేయడానికి వచ్చేశాడు. తనకొచ్చే స్కాలర్‌షిప్‌లో ప్రయాణ ఖర్చులు భరించడం కష్టం గనుక మధ్యలో ఒక్కసారన్నా వెళ్లలేకపోయాడు.

టేప్ రికార్డర్ నుండి ఒక విలక్షణమైన కంఠం ఉత్తేజపూరితంగా వినబడుతోంది.

"ఇంకా సస్పెన్స్ ఎందుకు! మూడో దాంట్లో ఏముందో చూడు మరి!" భరద్వాజ తొందర చేస్తున్నాడు.

రమణ తెరుకుని గిన్నె తీశాడు. అందరూ ఉత్కంఠతో ముందుకు వంగి చూశారు.

అందులో ఉన్నది పాడి మట్టి. పాడి పంటలతో పసిడి రాసులతో కళకళ లాడే జనవిది! మన జన్మభూమిది, ఆ మట్టి!!

త్యాగధనుల రక్తంతో తడిసి స్వేచ్ఛావాయువులు పీల్చిన భూమిది.

'అహింసో పరమో ధర్మః' అని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన మాతృభూమిది.....

ఎన్నో మతాల, అనేక సంస్కృతుల సమ్మేళనంతో భిన్నత్వంలో ఏకత్వం బోధించిన మాతృభూమి....

అందరి మనస్సులూ ఉద్వేగంతో బరువెక్కాయి.

"ఈ కానుక కేవలం ఒక్క రమణ కోసమే కాదు. మనందరి కోసం! అంతేకాదు, దేశం వదలి పరాయి దేశం మీద కాలుబెట్టిన లక్షలాది భారతీయులందరి కోసం" డాక్టర్ తాతారావు ఉత్తేజంగా అన్నారు.

టేప్ రికార్డర్‌లో నుండి ప్రదీప్‌జీ కంచుకంఠం నుంచి "....ఇస్ మిట్టీసే తిలక్ కరో, యే ధరతీ హై బలిదాన్ కీ...." అంటూ జాగృతి సినిమాలోని పాట ఉత్తేజపూరితంగా వినిపిస్తున్నది.

నేను పుట్టిన దేశం, నేను పెరిగిన దేశం, నా భవిష్యత్తుకు పునాదులు వేసిన నా దేశం- భారతదేశం. భక్తి భావంతో వారి మనస్సులు పులకిత మయ్యాయి.

డాక్టర్ తాతారావు ఆ మట్టిని చేతిలోకి తీసుకుని కళ్ల కద్దుకుని తర్జనితో నుదుటి మీద దిద్దుకున్నారు. ఆ తర్వాత అక్కడున్న వారంతా ఆ మట్టిని సిందూరంలా నుదుటి మీద దిద్దుకున్నారు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, మే 19-25, 1993)